# ధర్మపత్ని

ఆముదాలపల్లెకు పంచాయితీ ప్రెసిడెంటుగా ఎప్పుడూ రాజారావే ఎన్నిక అవుతున్నాడు. ఆ ఊరును రాజారావు మకుటంలేని మహారాజుగా ఇన్నాళ్ళు ఏలుతున్నాడు. ప్రజాస్వామ్యం కదా! మహారాజుగా ఏలడమేమిటని ఎవరైనా అడగొచ్చు! ప్రజలచేత ప్రజలకోసం ప్రజల యొక్క ప్రతినిధిగా ఎన్నుకోబడే ప్రజాప్రతినిధి రాజారావు. ఆ ఊరికి అతడు తప్ప వేరే దిక్కులేదని ప్రజల విశ్వాసం. ఆయన తప్ప ఆ ఊరిని శాసించే నాథుడే లేడని ప్రజల నమ్మకం.

ఆముదాలపల్లెలో ప్రజలకు తమతమ వ్యవసాయం పనులతో తీరికే వుండదు. ఒక ఊరిని పరిపాలించాలంటే అది పల్లెఅయినా సరే పరిపాలించేవాడికి తీరికనేది వుండాలి. మండలానికి జిల్లాకు అవసరమైతే రాష్ట్ర రాజధానికి దేశ రాజధానికి పోగలిగి వుండాలి. మండలం మొదలుకొని దేశం వరకు రాజకీయాలు తెలిసి వుండాలి. ఎత్తులు, ఎత్తులకు పై ఎత్తులు వేయగలిగి వుండాలి. ఊరికి కావల్సిన నిధులు తెచ్చే మొనగాడై వుండాలి !

గ్రామ పంచాయితీ ప్రెసిడెంటు అంటే మాటలా ! అటువంటి ఊరి పంచాయితీ ప్రెసిడెంటు పదవిని ప్రభుత్వం ఇప్పుడు స్త్రీకి కేటాయించింది.

ఊరి పంచాయితీ ప్రెసిడెంటుగిరి అంటే అంత సులభమా? బస్సుల్లో పడి మండలానికి జిల్లాకు పోవాలె ! మండలం ఆఫీసరు నుంచి జిల్లా కలెక్టరు దాకా కలుసుకోవాలె! అక్కరైతే మినిస్టరూ, చీఫ్ మినిస్టరు వరకూ పోవాలె! అవన్నీ ఒక ఆడదానితో అయ్యే పనులేనా? - అని రాజారావు మీసం మెలివేస్తూ ఆలోచనల్లో పడిపోయాడు.

అన్నిటికన్నా పెద్ద సమస్య మరోటి వుంది. ఆడదే ప్రెసిడెంటు అయితే అది తినదు! వేరే వాళ్ళను తిననియ్యదు! ఇగ అయినట్లే పని! ప్రభుత్వమిచ్చే నిధులతో అన్ని పనులూ

అన్ని అభివృద్ధి కార్యక్రమాలు సక్రమంగా దబదబ అయిపోతె ఊర్లో ప్రజలు మన మాట వింటారా! మన అదుపు ఆజ్ఞల్లో వుంటారా? అవన్నీ జరుగకుండా చూసుకోవాలని ఆడదానికేం తెలుస్తుంది? రాజకీయాలంటే ఎన్ని కిటుకులుంటాయి! ఒక ఆడదేం నడుపగల్గుతది అవన్నీ! - అని రాజారావు కలవరపడిపోయాడు.

రాజారావు మనస్సు వికలమయింది. ఆందోళన పాలయ్యాడు. వెంటనే అతనికి బాధ కూడా కలిగింది. పంచాయితీ ప్రెసిడెంటు అంటే ఎన్ని పనులూ! ఎన్ని వ్యవహారాలూ! అవన్నీ ఒక ఆడదానికియ్యడమేంది ప్రభుత్వం! ఏమిటో! ప్రభుత్వం దృష్టిలో ఊరి ప్రెసిడెంటు పదవి అంటే విలువ లేకుండా పోయింది! పంచాయితీ బోర్డులో ఒకటో అరో మెంబరు ఆడది వుండాలంటే అది ఏదో బాగానే వుంది! కానీ మొత్తం ప్రెసిడెంటే ఆడది కావాలంటే అది సాధ్యమయ్యే పనేనా? ఒక ఆడది ప్రెసిడెంటుగా ఏం వెలగబెడ్తుందని ప్రభుత్వం ఈ విధంగా కేటాయించింది! - రాజారావుకు అదంతా ఆలోచిస్తుంటే బాధ స్థానంలో కోపం ముంచుక వచ్చింది. ఆ కోపం ఎవరి మీదా? - తన కోపమే తన శత్రువు అని చిన్నప్పుడెప్పుడో చదివాడు. కాబట్టి కోపంతో లాభం లేదు - అనుకున్నాడు.

దీనికేదైనా దారి చూడాలి! ఈ ఊరి ప్రెసిడెంటు పదవీ, పరిపాలన తన గుప్పెట్లోంచి పోకూడదు. ఆ ఉపాయం ఆలోచించాలి అనుకున్నాడు రాజారావు. ప్రశాంతమైన మనస్సుతో ఆలోచించాడు. చివరకు అతనికో ఉపాయం తట్టింది. ఆ ఉపాయం తట్టినందుకు తన తెలివికి తనే సంబరపడిపోయాడు రాజారావు. తన బుర్ర గట్టిదే! అని ఖుషీగా తలూపుకున్నాడు.

ఇంతకూ రాజారావుకు తట్టిన ఉపాయమేమిటంటే ఆ యేడు ఎన్నికల్లో ఊరి పంచాయితీ ప్రెసిడెంటుగా అది ఆడవాళ్ళకు కేటాయించబడింది కాబట్టి తన భార్య పిచ్చమ్మను నిలబెట్టాలను కోవడం! పిచ్చమ్మ ప్రెసిడెంటు అయితే గియితే - అయితే గియితే ఏంది ? తను అనుకున్న తర్వాత పిచ్చమ్మ ప్రెసిడెంటు అయి తీరుతుంది. - అప్పుడు అధి కారం ఎక్కడికీ పోదు! తన గుప్పెట్లోనే ఉంటుంది.

రాజారావు పిచ్చమ్మకీ విషయం చెప్పాడు. అది విని పిచ్చమ్మ పరేషానయింది. "ఇంట్లో పిల్లలు లోకంగా బతుకుతున్న నేను ప్రెసిడెంటు ఎట్లయిత? ఇంటి గడపదాటి ఎన్నడూ - ఎన్నడో బతుకమ్మ పండుగనాడు తప్ప బయటికి పోను! ఊరికి పంచాయితీ ప్రెసిడెంటుగ నిలబడమంటె నాతోటి అయితదా?" అని భయపడిపోయింది పిచ్చమ్మ. ఆమెకు ఏం అనాలో ఏం చేయాలో తోచలేదు. కాళ్ళు చేతులూ చల్లబడిపోయాయి.

"ప్రెసిడెంటు పని నాతోటి అయితదా? నాకేం చాతనయితది?" అంది పిచ్చమ్మ. భర్త మాట విని పూడుకపోయిన ఆమె గొంతు కాస్సేపటికి పెకిలి మాట బయటికి వచ్చింది. ఆమె ముఖంలో రక్తమంతా ఇంకిపోయింది. నోటి తడి ఆరిపోయింది. గుండె దడదడమని

కొట్టు కుంటున్నది. శరీరం చెమటలతో తడిసిపోయింది. "ఎందుకే అంత బుగులు పడ్తున్నవు! ఎన్క నేనున్నగదే! పనులన్ని నేనే చూస్కుంట!" అన్నాడు రాజారావు చిరునవ్వుతో భార్యవైపు చూస్తూ. భార్య నిస్సహాయతను చూస్తే అతనికి చాలా ఆనందంగా వుంది. "పిచ్చిముండ!" అనుకున్నాడు మనస్సులో.

అయినా పిచ్చమ్మకు భయం పోలేదు. "అంతేనా లేకపోతె గా పనులన్న నాతోటి ఏమైతయి! నాకు అచ్చరం ముక్క రాదు. సంతకం చెయ్యాలంటె?" - భార్య మాటలు రాజారావుకు ముద్దుగా వినిపించాయి.

"సంతకం అన్నీ క్షణంలో నేర్చుకుంటవు! చూడు! చదవడం రాయడం అవన్నీ పెద్ద కష్టమేమీ కావు!" రాజారావు పిచ్చమ్మకు ధైర్యం చెప్పాడు.

"మరి మండలానికి జిల్లాకు తిరుగాలె! అవన్నీ!" - సందేహం ప్రకటించింది పిచ్చమ్మ.

"అవన్నీ నీ ఎంట నేనుండి నడిపిస్తను గదా! నీకు బుగులెందుకే! పిచ్చిదానా! నీకు మీ నాయన సరిగ్గనే పేరు పెట్టిండు పిచ్చమ్మ అనీ" పెద్దగా నవ్వాడు రాజారావు.

"అది మా నాయనమ్మ పేరట!" అంది పిచ్చమ్మ సిగ్గుపడ్తూ.

ఇన్నాళ్ళు పిచ్చమ్మ ఇల్లు, వంట, వడ్డనలు వీటికే అంకితమైపోయి జీవితం గడిపింది. భర్త పిల్లలు తప్ప ఆమెకు వేరే లోకమే లేదు. భర్తనే దేవునిగా భావించింది. ఆయన ఆయురారోగ్యాల కోసం పూజలు వ్రతాలు ఉపవాసాలు చేసింది. అతని వంశాన్ని నిలపడం కోసం పిల్లల్ని కన్నది. పెంచింది. కాని ఏదో ఒకరోజు భర్తకు ఈ విధంగా పనికి వస్తానని ఆమె కలలో కూడా అనుకోలేదు. అది పిచ్చమ్మకు సంతోషాన్ని సంతృప్తిని కలిగించింది.

ఎన్నికలు వచ్చాయి. రాజారావు భార్య పిచ్చమ్మకు పోటీగా నిలబడడానికి ఆడవాళ్లె వరూ ముందుకు రాలేదు. పిచ్చమ్మ పోటీ లేకుండా ఎన్నికైంది.

ఊరివాళ్ళు పిచ్చమ్మకు సన్మానసభ ఏర్పాటు చేసారు. ఆ సన్మానసభ ఏర్పాటు చేయడంలో రాజారావు హస్తం లేదని చెప్పలేము. సన్మాన సభకు జిల్లా కలెక్టరు ఆ ప్రాంతం ఎం.ఎల్.ఏ. ఇంకా కొందరు నాయకులు వచ్చారు. అందరూ ఉపన్యాసాలిచ్చారు. స్త్రీలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుకెళ్ళిపోతున్నారు. ఏ విషయంలో స్త్రీలు పురుషులకు తీసిపోరు. రాజకీయాల్లోకి స్త్రీలు ప్రవేశిస్తే రాజకీయాలు ప్రక్షాళనమై పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుంది - అని అందరి ఉపన్యాసాల సారం. దాంతోపాటు అందరూ పిచ్చమ్మను, పిచ్చమ్మ దక్షతను గురించి పొగిడారు.

"అంతేమరి! ఆడోళ్ళంటె ఏమైన తక్కువనా? అమ్మోరు దుర్గమ్మ రాక్షసున్ని సంపలేద? - శ్రీకృష్ణ పరమాత్మ మూర్ఛపోతె సత్యభామ యుద్ధం చేసి నరకాసురున్ని సంపలేద? ఆడోళ్ళు ఎందులో తక్కువ!" - అని సభకు వచ్చిన ఊరి ప్రజలు పురాణకథలను స్మరించుకొని

ఆనందపడిపోయారు.

సన్మానసభకు వచ్చిన ఆడవాళ్లందరు ఒకపక్క కూర్చున్నారు. మగాళ్ళంతా మరోపక్క కూర్చున్నారు. ఇంకా అందరి ఉపన్యాసాలు కాకముందే ఆడవాళ్ళు ఒక్కొక్కరే జారుకున్నారు. పొద్దంతా వ్యవసాయం పనులు చేసి చేసి అలిసిపోయి వున్నారు వాళ్ళు. పైగా ఇప్పుడు మగాళ్ళు ఇంటికి చేరేసరికి వంటచేసి పెట్టాలి. వచ్చేసరికి కూడు తయారుగా లేకపోతే ఇల్లు పీకి పందిరి వేస్తారీ మగాళ్ళు! అనుకొని సభ పూర్తి కాకముందే ఆడవాళ్ళు ఒక్కొక్కరే మాయమయ్యారు. ఇక ఆ సభలో మగాళ్ళ మధ్య మిగిలింది సన్మానం జరుపుకుంటున్న పిచ్చమ్మ మాత్రమే.

ఆ తర్వాత పేపరు వాళ్ళు, టీవీ, రేడియో వాళ్ళు పిచ్చమ్మతో ఇంటర్వ్యూ చేస్తామని వచ్చారు.

"వీళ్ళను ఎవరు పిలిచింద్రు?" అని విసుక్కున్నాడు రాజారావు మనస్సులో.

వాళ్ళను చూసి పిచ్చమ్మ భయపడిపోయింది. ఇంటర్వ్యూలో ఏ ప్రశ్నలకు ఏం సమాధానాలు చెప్పాలో రాజారావు పిచ్చమ్మకు చెప్పాడు. అయినా అప్పుడప్పుడు కొన్ని ప్రశ్నలకు ఏం జవాబు చెప్పాలో తెలియక కెమెరాలో పడకుండ కెమెరా వెనుక కూర్చున్న భర్తవైపు ప్రశ్నార్థకంగా చూసింది పిచ్చమ్మ. కాని ఆమె మౌనాన్ని ఆసరాగా తీసుకొని ఇంకో అతను ఇంకేవేవో ప్రశ్నలు కురిపించాడు. అట్లా పోటీపడి పాత్రికేయులు టీవీ రేడియో వాళ్ళు ప్రశ్నలడిగారు. పిచ్చమ్మ తను జవాబులు చెప్పగలిగినవాటికే చెప్పింది. వాళ్ళు ఎడిట్ చేసుకుని తమకు కావల్సినంత పత్రికల్లో వేసుకున్నారు. రేడియోలో వినిపించారు. టీవీలో చూపించారు. మొత్తం మీద ఊరి పంచాయితీ ప్రెసిడెంటుగా ఒక స్త్రీగా పిచ్చమ్మ పోటీ లేకుండా ఎన్నికయిందన్న వార్త అంతటా పాకింది.

తన గొంతు టీవీ రేడియోల్లో విని తన బొమ్మలు టీవీలో పత్రికల్లో చూసుకొని పిచ్చమ్మ సంబరపడి పోయింది. ఆమెలో ఎన్నడూ లేని ఆత్మ విశ్వాసం పైకుబుకింది. "ఇన్నాళ్ళు నేను మరుగున పడిపోయిన మానిక్యం లెక్క వున్న. ఇన్ని రోజులు ఇల్లు, సంసారం చక్కబెట్టిన నేను ఇప్పుడు ఊరును చక్కబెట్టలేనా? నా పెనిమిటి నా మీద విశ్వాసం వుంచి ఊరి ప్రెసిడెంటు కావాలని అన్నడు. ఇప్పుడు ఆయన అన్నట్లనే ప్రెసిడెంటు అయిన. ఆయన పేరు నిలబెట్టెటందుకు మంచిగనే పని చేయాలె" అనుకుంది పిచ్చమ్మ.

మొట్టమొదటి పంచాయితీ సభ సమావేశం ఏర్పాటయింది. సమావేశానికి పోవాలని ఇంట్లో పనులన్నీ ఆదరాబాదరాగా తీర్చుకొని పిచ్చమ్మ తయారైంది. అది చూసి రాజారావు "ఎక్కడికే తయారయితున్నవు?" అని అడిగాడు.

"ఇయ్యాల పంచాయితీ సభ సమావేశం వున్నది గదా. అక్కడికే పోతనని" - భయంతో

పూర్తి చేయకుండానే ఆగిపోయింది పిచ్చమ్మ.

"ఇంటి గడపదాటి ఎప్పుడైన బయటికి పోయినావే? ఇయ్యాల తయారైనవు బయటికి పోతనని! సమావేశం లేదు గిమావేశం లేదు ఇంట్లనే - నీ జాగ ఇంట్లనే - వుండు. ఏమైన కాయితాలు వస్తే సంతకం చెయ్యి! గంతే నీ పని! నువ్వు మొదలు లోపలికి పో!" అని కసిరాడు రాజారావు. పిచ్చమ్మ కట్టెలా నిలబడిపోయింది.

రాజారావు కండువా భుజం మీద వేసుకొని చేతిలో పాన్నుకర్రను పట్టుకొని కాళ్ళకు చెప్పులేసుకొని పంచాయితీ ఆఫీసువైపు నడిచాడు. బయటికి పోతున్న అతన్ని చూసి పిచ్చమ్మ నిర్విణ్ణురాలైంది.

రాజారావు పంచాయితీ ఆఫీసువైపు పోతుంటె పిచ్చమ్మ పిచ్చిగా చూసింది. తన పదవీ అధికారాలు గింతటితో ఒడిసిపోయినట్లేనా? తనను తోలుబొమ్మను చేసి ఆడించేటందుకేనా తన భర్త గిదంతా చేసింది!

అధికారాన్ని తన గుప్పెట్లో పెట్టుకునేటందుకేనా గీ తతంగమంతా!

తరతరాలుగా ఆడదాని చరిత్ర గింతేనా? ధర్మపత్నిగా ఆడదాని పాత్ర ఇంతేనా?

రాముని యాగంలో ధర్మపత్ని బంగారు సీతగా - ఒక బొమ్మగానే - పాలు పంచుకున్నది కదా! మగాడి అధికార హోమంలో ఆడది ఆహుతి కావల్సిందేనా?

ఇన్నేళ్లు నిశ్శబ్దంగా వుండే పిచ్చమ్మ మనస్సులో ఆలోచనలు అలలు అలలుగా లేచాయి. మూగమనస్సు విచ్చుకుంది. ఆమెలో ఏదో చైతన్యం ఉబుకింది. పిచ్చమ్మ లేచి నిలబడింది. ఏదో నిశ్చయించుకున్న దానిలా పంచాయితీ ఆఫీసువైపు దృఢంగా అడుగులు వేస్తూ గబగబ నడిచింది.

*("మూసీ" మార్చి 1998 మాసపత్రికలో ప్రచురితమైంది)*

* * *